క్లుప్తంగా

వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లో లెవెన్ లడ్డూస్ జట్టు గెలుపొందింది.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి దేవాలయం, శ్రీపద్మావతి–శ్రీనివాస కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం రుద్రహోమాన్ని నిర్వహించారు. పురోహితులు ధర్మవరం అవధానం శ్రీనాథశర్మ, పవన్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో పండితులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, చండీయాగం, రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త పూజారి మంజుల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణానాయక్

గాండ్లపెంట: గాండ్లపెంట, ఎన్పీ కుంట మండలాల్లోని ఆర్డీటీ సంఘం పాఠశాలల్లో పని చేసే సంఘం ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కదిరి రీజియన్ ఆర్డీ శాంతమ్మ సూచించారు. గురువారం స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో ఆంగ్ల భాష శిక్షణ ముగింపు సమావేశం జరిగింది. ఉపాధ్యాయులు ఆంగ్ల భాషలో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన కల్పించాలని ఎంఈఓ కృష్ణానాయక్ కోరారు. కార్యక్రమంలో ఏటీఎల్ కృష్ణ, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్‌కు చెందిన సుధాకర్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేల తక్షణసాయాన్ని గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీడీఓ పూల నరసింహులు అందజేశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, వెల్ఫేర్ అసిస్టెంట్ బాబా, వైఎస్సార్సీపీ నాయకులు సిద్దారెడ్డి, బాబాఫకృద్దీన్, పూలశీన, తాహీర్, శ్రీరాములు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ: పరిసరాల శుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ రాజేంద్ర అన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలన్నారు. గురువారం వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర పీడితులను గుర్తించారు. వారి నుంచి రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపారు. ఈ సందర్భంగా డ్రైనేజీలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భారతి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, చక్రి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'హనుమాన్ దర్శన్'కు ప్రత్యేక బస్సులు



భక్తులకు హనుమాన్ దర్శన్ కరపత్రాలను అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: శ్రావణమాసం సందర్భంగా హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్ తెలిపారు. గురువారం పట్టణంలోని షిర్డీ సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాల్లో కమిటీ సభ్యులు, భక్తులకు కరపత్రాలు అందజేశారు. పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.300 టికెట్టు ధర నిర్ణయించామన్నారు. ఆగస్టు నెలలో 26, 29, సెప్టెంబర్ నెలలో 2, 5, 9, 12 తేదీల్లో హనుమాన్ దర్శన్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7382860947 నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు నాగార్జున రెడ్డి, వైఎస్ రెడ్డి, తిరుమలేసు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 7వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో డ్రైనేజీ కాలువలను సరిగ్గా శుభ్రం చేయలేదని పలువురు ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎప్పటికప్పుడు కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు సూచించారు. తమకు ఇంటిపట్టా వచ్చినా బిల్లులు పడలేదని పలువురు జగనన్న కాలనీల లబ్ధిదారులు తెలిపారు. వెంటనే హౌసింగ్ ఏఈతో మాట్లాడి బిల్లులు త్వరితగతిన పడేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ.. సచివాలయ పరిధిలో ఏ చిన్న సమస్య కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు వారి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లోని పథకాల్లో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ గద్దం రంగనాయకులు, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం కనిశెట్టిపల్లి, మైలేపల్లి, తిరుమదేవరపల్లి, కొడపగానిపల్లి, వేములేటిపట్టి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. సమస్యలను తెలుసుకుని, పరిష్కరిస్తారని తెలిపారు.

'దొంగ ఓట్ల సంస్కృతి టీడీపీదే'



మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ నాయకులు

ముదిగుబ్బ: మా ప్రభుత్వంలో ఓటుకు ఆధార్ అనుసంధానం చేస్తున్నాం. నిజాయతీ అంటే ఇది. దొంగ ఓట్ల సంస్కృతి మాది కాదు టీడీపీదే అని వైఎస్సార్సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల దొంగ ఓట్లు సృష్టించిన ఘనత వైఎస్సార్సీపీదే అంటూ వరదాపురం సూరి అభిమానులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గురువారం స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో పలువురు విలేకరులతో మాట్లాడారు. మీ అన్న ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎక్కించిన ఓట్లతో మా అన్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పుడు దొంగ ఓట్లు లేవా? అని ప్రశ్నించారు. దొంగ ఓట్ల సంస్కృతి అప్పటి టీడీపీ హయాంలోనే ఉందన్నారు. గతంలో మీ నాయకుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పట్లో వైఎస్సార్సీపీ సర్పంచులు కండువాలు వేసుకుంటేనే బిల్లులు పెడతామని అప్పుడు ఎంపీడీఓగా పని చేసిన మల్లికార్జున చేసిన వ్యాఖ్యలు దిన పత్రికల్లో వచ్చిన మాట వాస్తవం కాదా అన్నారు. దొంగ ఓట్ల నివారణకు ఓటుకు ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని చేపట్టిన ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మా ప్రభుత్వ హయాంలో పుట్టపర్తి నుంచి ముదిగుబ్బకు రోడ్డు నిర్మాణం, బత్తలపల్లి నుంచి ముదిగుబ్బకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం, అలాగే బెంగళూరు నుంచి విజయవాడకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు చంద్రాయుడు, కిరణ్‌మోహన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, గనపర్తి నారాయణప్ప, శివనారాయణ, వేణుగోపాల్, శ్రీనివాసులు, వీరేష్, భాషా, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సమష్టిగా పని చేస్తే విజయం తథ్యం



అవార్డులు పొందిన ఉద్యోగులతో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, అధికారులు

బత్తలపల్లి: ఏ రంగంలోనైనా అందరూ సమష్టిగా పని చేస్తే గొప్ప విజయాలు సొంతమవుతాయని ఎంపీపీ బగ్గిరి త్రివేణి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన సచివాలయ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో బత్తలపల్లి మండలం జిల్లాలో ఐదవ స్థానంలో నిలిచిందన్నారు. మరింత కష్టపడి పని చేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌజన్య కుమారి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఎంఈఓ సుధాకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వరలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీదేవి, మల్లికార్జున, చిన్నసూరి, మండలంలోని 11 సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



ముక్తాపురంలో ఇంకుడు గుంత నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న అధికారులు

కనగానపల్లి: వీధుల్లోకి మురికి నీరు వదలకుండా ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ తెలిపారు. మండలంలోని ముక్తాపురంలో జగనన్న హౌసింగ్ కాలనీలో ఇంకుడు గుంతలు (సో పిట్స్) నిర్మాణాలను అధికారులు ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇంకుడుగుంతల నిర్మాణాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హౌసింగ్ కాలనీల్లో ఏర్పాటు చేసుకొనే ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికీ రూ.6 వేలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, హౌసింగ్ ఏఈ చిరంజీవి, ఏపీఓ వెంకటేష్‌నాయక్, హౌసింగ్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నీ తామై అంత్యక్రియలు



మృతదేహాన్ని తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: తమిళనాడు రాష్ట్రానికి చెందిన పద్మనాభం (70) కొద్ది సంవత్సరాలుగా పుట్టపర్తి పట్టణం గోకులంలో నివాసం ఉంటూ సత్య సాయి బాబా భక్తుడిగా ఇక్కడే స్థిరపడ్డాడు. గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు బంధువులెవరూ లేకపోవడంతో పోలీసులు, స్థానికులు ఈ విషయాన్ని ఖిద్మత్ ఏ ఖల్క్ సొసైటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సొసైటీ సభ్యులు మృతదేహాన్ని పట్టణంలో కర్ణాటకనాగేపల్లి శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. వారి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు షామీర్, అలీ, షాకీర్, చాంద్, సాయి, మాతంగి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్ పంపిణీ



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ మధుసూదన్‌రావు

కదిరి అర్బన్: కే.బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 6 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు గురువారం కెనరాబ్యాంక్ మేనేజర్ మధుసూదన్‌రావు రూ.22,500 స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. అలాగే బీసీ విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కెనరా విద్యాజ్యోతి పథకం కింద స్కాలర్‌షిప్పులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్‌బాబు, ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, కిష్టప్ప, రెడ్డెప్ప, బ్యాంకు సిబ్బంది బాలకృష్ణారెడ్డి, మనోహర్, పాల్గొన్నారు.

చంద్రయాన్ సక్సెస్‌పై సంబరాలు



వినూత్నంగా అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు

బత్తలపల్లి: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సంబరాలు జరుపుకున్నారు. కేరింతలు కొడుతూ బాణాసంచా కాలుస్తూ సంబరాల్లో మునిగిపోయారు. పోట్లమర్రి ఎస్సీ కాలనీలో బత్తల ఆదినారాయణ ఆధ్వర్యంలో ఇస్రో శాస్త్రవేత్తల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. స్వీట్లు పంచుతూ.. జయహో భారత్.. జై భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీరాములు, ధన, పరమేష్, నాగభూషణ, ఆనంద్, జయసింహా, లాలూ ప్రసాద్, హర్షవర్ధన్, మైత్రేయ పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో గురువారం పట్టణంలో కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు వినూత్నంగా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇస్రో కంగ్రాట్స్ అనే అక్షరాల రూపంలో కూర్చుని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ మేడాపురం రామిరెడ్డి, కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

- ఒకరికి తీవ్ర గాయాలు

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలోని వాటర్ ప్లాంట్ వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వద్దిరెడ్డిపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వద్దిరెడ్డిపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి మంచినీటి కోసం టీవీఎస్ ఎక్సెల్‌లో వాటర్‌ప్లాంట్ వద్దకు వచ్చాడు. బిందె నీరు పట్టుకుని గాండ్లపెంట వైపు వెళ్తుండగా.. అదే సమయంలో గాండ్లపెంట నుంచి కదిరికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్న అమర్‌నాథ్ అనే వ్యక్తి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో భాస్కర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయాయి. వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలించినట్లు బంధువులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో సెంట్రల్‌బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కర్నూలు వారి ఆధ్వర్యంలో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ లలిత, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ అంజనప్ప, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయిసూరి, మెడికల్ ఆఫీసర్ ప్రమీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అమరవీరులు, దేశంపై గౌరవం కలిగి ఉండాలన్నారు. భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

డ్రగ్స్ విక్రయించడం చట్టరీత్యా నేరం

ముదిగుబ్బ: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సెబ్ సీఐ ఎస్.లక్ష్మీదుర్గయ్య పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, నల్లమందు, బ్రౌన్ షుగర్ తదితర మాదక ద్రవ్యాలను తయారు చేయడం, రవాణా చేయుట, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కుటుంబాలు సర్వనాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, డీటీఎఫ్ సీఐ శ్రీధర్, పుట్టపర్తి సీఐ మాధవి, ఎస్ఐలు జాబీఉల్లాహ్, రాజన్న, హెడ్ కానిస్టేబుల్ రమణారావు, శంకర్ నాయక్, రమేష్, సిబ్బంది మల్లికార్జున, కృష్ణవేణి, ప్రభావతి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

నల్లచెరువు: మండల పరిధిలోని ఓరువాయి సచివాలయాన్ని ఎంపీడీఓ శకుంతల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, ఇతర శాఖలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ.. యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. అనంతరం జగనన్న పాల వెల్లువ రీసర్వేపై వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి వలంటీర్ వారంలో 3 సార్లు సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు.

కనకదాసు విగ్రహం ఏర్పాటు చేయాలి



టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కోటి సూర్యప్రకాష్ బాబు

బత్తలపల్లి: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు గురువారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కురుబ సంఘం నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలిపిరి కూడలి లేదా కపిలతీర్థం కూడలి వద్ద భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కొత్తగా నిర్మాణంలో ఉన్న రహదారుల్లో ఏదైనా ఒక రహదారికి భక్త కనకదాసుగా నామకరణం చేయాలన్నారు. ఒక భవనానికి కురుబ పీఠముగా నామకరణం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. కనకదాస భవనం ఏర్పాటుకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు.

కేసులు ఉపసంహరించుకోవాలి

ధర్మవరం అర్బన్: ఫ్యాప్టో నాయకులపై 151 సీఆర్‌పీసీ సెక్షన్ కింద నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బీకే ముత్యాలప్ప కోరారు. గురువారం డీఎస్పీ శ్రీనివాసులును కలసి వినతిపత్రం అందించారు. ఇందుకు డీఎస్పీ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రవీంద్రరెడ్డి, లక్ష్మయ్య, రాంప్రసాద్, నాగప్ప పాల్గొన్నారు.

టైఫాయిడ్‌తో బాలుడి మృతి

ప్రశాంతినిలయం: మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి మార్కెట్ ప్రాంతంలో నివసిస్తున్న జిల్లాన్, తబ్సుమ్ దంపతుల కుమారుడు సుహాన్ (6) టైఫాయిడ్‌తో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నాలుగు రోజులుగా సుహాన్ జ్వరంలో బాధపడుతుండటంతో కొత్తచెరువులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయితే గురువారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ వైద్యుడు ఫణీంద్ర సాయి సిబ్బందితో కలసి మృతి చెందిన బాలుడి ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. రిపోర్టులను పరిశీలించి టైఫాయిడ్‌తో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. జ్వరాల బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని బ్రిలియంట్ పాఠశాల హెచ్‌ఎం సివి శేషు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సేకరణ పోటీల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి చేతుల మీదుగా రూ.50 వేల ప్రథమ బహుమతి అందుకున్నారు. గురువారం ఆ నగదును పాఠశాలలోని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. అలాగే మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

సహకార సంఘాలతో ఆర్థికాభివృద్ధి

ధర్మవరం రూరల్: ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సస్యమిత్ర సహకార సంఘాలతో రైతులు, వాటాదారులు ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే లక్ష్యమని మండల టీం లీడర్ దస్తగిరి, ఎకాలజీ సభ్యులు వీరభద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పోతుకుంట ఆర్డీటీ స్కూల్‌లో 7వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి వాటాదారులు, రైతులు సుమారు 153 మంది హాజరయ్యారు. రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, యంత్రాలు, విత్తనాలు, రైతు అంగడి ద్వారా అందించే సేవలపై వివరించారు. కార్యక్రమంలో ఎకాలజీ సిబ్బంది అనీల్, శంకర్ నాయక్, రామకృష్ణ, మేనేజర్ ప్రతాప్, అమర్నాథ్, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.